క్లుప్తంగా

ఎస్‌బీఐలో ఉచిత వైద్య శిబిరం



పరీక్షిస్తున్న డాక్టర్ స్వర్ణలత

సీతంపేట: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సాలగ్రామపురం బ్రాంచిలో వీ డెంటల్, వీ హెల్త్ కేర్ సహకారంతో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బ్యాంక్ కస్టమర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలు ఉచితంగా పొందారు. బీపీ, షుగర్, దంత పరీక్షలు నిర్వహించారు. సుమారు వంద మంది కస్టమర్లు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. బ్యాంకు చీఫ్ మేనేజర్ పి.ఎస్.ఎన్.మూర్తి, వీహెల్త్ కేర్ డైరక్టర్ కె.ఎం.కె.రమేష్ పర్యవేక్షణలో డాక్టర్ వి.స్వర్ణలత, క్లినిక్ హెడ్ సి.హెచ్.కృష్ణ, వైద్య సిబ్బంది భారతి, లతీష, తులసి, లిఖిత్ సేవలందించారు.

రాములోరి కల్యాణానికి ఉత్సవ రాట



రామాలయంలో పెళ్లిరాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో నిర్వహిస్తున్న వసంత నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం పెళ్లిరాట ఉత్సవం నిర్వహించారు. ఈ నెల 6వ తేదీన శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవం జరిపించనున్నారు. ఈ మేరకు పంచమిని పురస్కరించుకుని బుధవారం ఉదయం 8 గంటలకు నీరాటోత్సవాన్ని సంప్రదాయ సిద్ధంగా నిర్వహించి పెళ్లి రాట వేశారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ రెడ్డి, సనపల వరప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అల్జీమర్స్‌పై అవగాహన సదస్సు రేపు

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ సౌజన్యంతో మతిమరుపు (అల్జీమర్స్)పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కె.మాధవి, పి.కమల ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు సాయంత్రం 5గంటలకు వుడాకాలనీ ఈస్ట్ పార్కులో స్థానిక పార్కు కమిటీ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. అల్జీమర్స్‌కు కారణాలు, నివారణ మార్గాలపై ప్రముఖ వైద్యులు అవగాహన కల్పిస్తారని, వాకర్స్, ఇతర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పీడీఎస్ బియ్యంతో స్వాధీనం చేసుకున్న బొలేరో వాహనం

అల్లిపురం: పీడీఎస్ బియ్యం రవాణా చేస్తున్న వాహనాన్ని టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం టూటౌన్ ఎస్ఐ డి.రాముకు వచ్చిన సమాచారం మేరకు ఏపీ 39 టీబీ 7487 బొలేరో వాహనంలో అక్రమంగా పీడీఎస్ రైస్ తరలిస్తున్నారన్న సమాచారం మేరకు గొల్లలపాలెం జంక్షన్ వద్దకు ఎస్ఐ రాము చేరుకున్నారు. వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో 50 కేజీల బరువు గల 80 పీడీఎస్ రైస్ బ్యాగులు గుర్తించారు. దీంతో వాహనం డ్రైవర్ ఆళ్ల రాజును అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఎల్లమ్మతోటకు చెందిన కడుపు శ్రీను దగ్గర నుంచి బియ్యం తీసుకుని, పద్మనాభానికి చెందిన సంపంగి సూర్యనారాయణకు అప్పగించడానికి తీసుకెళ్తున్నట్లు వెల్లడించాడు. దీంతో ముగ్గురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వాహనంతో సహా బియ్యాన్ని సివిల్ సప్లయి అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

కొత్త రేషన్ కార్డుల మంజూరు ఎప్పుడు?



53వ వార్డు గ్రీన్ గార్డెన్స్ సచివాలయంలో లబ్ధిదారుల పడిగాపులు (ఫైల్)

- 49, 50, 51, 53 వార్డుల ప్రజల నిరీక్షణ
- సర్వేల పేరిట ప్రభుత్వం కాలయాపన



51వ వార్డు అంబేడ్కర్ కాలనీ సచివాలయం

మద్దిపాలెం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజల ఊసే మర్చిపోయారు. తొమ్మిది నెలలు పూర్తి కావస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఎలాంటి అభివృద్ధి, సంక్షేమం కనిపించటంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎంతో మంది నిరీక్షణ..

ఈ క్రమంలో జీవీఎంసీ 49, 50, 51, 53 వార్డుల్లో కొత్తగా రేషన్ కార్డులు, పెన్షన్ల కోసం సచివాలయానికి 300 మంది చొప్పున అంటే.. ఒక వార్డుకు కనీసం 1500 మంది కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్ల కోసం నిరీక్షిస్తున్నారు. కొండవాలు ప్రాంతంలో ఉన్నవాళ్లు, దిగువ మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు ఆశగా ఎదురు చూస్తున్నారు. గత అక్టోబర్ నుంచి ప్రతి నెలా రేషన్ కార్డులు అందజేస్తామంటూ ఎప్పటికప్పుడు దాటవేస్తున్నారు. రకరకాల సర్వేల పేరుతో ఉన్న రేషన్ కార్డులను తొలగించడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొత్తకార్డులు, పథకాల ఊసే లేదంటున్నారు. ప్రతి నెల అర్హులైన లబ్ధిదారులు ఆశతో సచివాలయాలకు, సివిల్ సప్లయి, తహశీల్దార్ కార్యాలయాలకు చెప్పులరిగేలా ప్రదక్షిణలు చేయడమే తప్ప ప్రభుత్వంలో చలనం కనిపించడంలేదు.

ఎన్నాళ్లీ ఎదురుచూపులు?

కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. అదిగో ఇదిగో అంటున్నారే కానీ అమలు చేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని మండిపడుతున్నారు. రేషన్ కార్డులు లేవు, కొత్త పింఛన్లు లేవు. గత నవంబర్‌లో భర్త మరణిస్తే అతని పెన్షన్ భార్యకు ట్రాన్స్‌ఫర్ చేశారే తప్ప ఇంకే పథకాలు అమలు చేయలేదు. పథకాలు అమలు చేయాలంటే రేషన్ కార్డు అవసరం అని ప్రభుత్వానికి తెలియదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ముందు రేషన్ కార్డుల కోసం నోటిఫికేషన్ ఇస్తేనే కదా మిగతా పనుల్లో కదలిక వచ్చేది అని మరికొందరు వాపోతున్నారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఎంతో మంది లబ్ధిదారులు సంక్షేమ పథకాల కోసం, వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగుల పెన్షన్ల కోసం ఎదురు చూస్తున్నారు.



49వ వార్డు ఏఎస్ఆర్ నగర్ సచివాలయం

ఈకేవైసీ అయ్యాక..

కొత్తగా ఈకేవైసీ ప్రక్రియ కొనసాగుతుందని, అది అయిన వెంటనే మేలో కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని మళ్లీ వాగ్దానాలు చేస్తున్నారు. ఇలా ఎంత కాలం ప్రజలను మోసం చేస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రేషన్ కార్డుల కోసం నోటిఫికేషన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



51వ వార్డు వుడా కాలనీ సచివాలయం

సచివాలయాలు వెలవెల..

ప్రస్తుతం సచివాలయ కార్యదర్శులు సజావుగా పని చేసుకునే పరిస్థితి లేదు. సర్వేల పేరుతో ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు తీసుకోవాల్సి వస్తుంది. వలంటీర్ల పని భారమంతా వీరిపై పడింది. అంతే కాక ప్రభుత్వం ఏ పథకాలు ప్రవేశపెడుతుందో, ఎప్పుడు నోటిఫికేషన్ విడుదల చేస్తుందో వంటి కనీస విషయాలు కూడా వీరికి తెలియడంలేదు.

ప్రణాళిక ప్రకారం టీకాల కార్యక్రమం



రంగిరీజువీధి యూపీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. బుధవారం రంగిరీజు వీధిలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. అన్ని ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. సిబ్బంది, వైద్యులు సమన్వయంతో పని చేయాలన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది విధిగా ముఖ హాజరు వేయాలని, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

24న మినీ బాలోత్సవం



మినీ బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

డాబాగార్డెన్స్: ఆసరా చారిటబుల్ సొసైటీ వార్షిక సాధారణ సమావేశాన్ని పురస్కరించుకుని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మినీ బాలోత్సవం నిర్వహించనున్నట్టు ఆసరా అధ్యక్షురాలు సి. సునీత తెలిపారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మినీ బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ సందర్భంగా ఆమె మాట్లాడారు. వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్‌తో కలిసి ఈ నెల 24న కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసరా గత మూడేళ్లుగా వీసీసీ ద్వారా నిర్వహిస్తున్న ట్యూషన్ సెంటర్లు, క్లబ్ విద్యార్థులకు అకడమిక్, కల్చరల్ కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తుందన్నారు. ఆయా సెంటర్ల ద్వారా రెగ్యులర్ చదువుతో పాటు ఏడాది పొడవునా వివిధ రకాల ఎక్స్‌ట్రా కరిక్యులం యాక్టివిటీస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఆసరా వార్షిక సమావేశాన్ని పురస్కరించుకుని పిల్లల పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వీసీసీ జిల్లా కన్వీనర్ కె. సుశీల మాట్లాడుతూ ఎల్‌కేజీ నుంచి రెండో తరగతి వరకు సబ్ జూనియర్స్‌గా, 3 నుంచి 5వ తరగతి పిల్లలు జూనియర్స్‌గా, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు సీనియర్స్‌గా పరిగణించి ఈవెంట్స్ జరుగుతాయన్నారు. చిత్ర లేఖనం, కథ చెప్పడం, మెమరీ టెస్ట్, ఫ్యాన్సీ డ్రెస్, రైమ్స్, బృందగానం, జానపద బృంద నృత్యం, లఘు నాటిక, ఏకపాత్రాభినయం, బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్, వ్యాస రచన, క్విజ్ వివిధ కేటరిగీల్లో పోటీలు జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు 8309812422 నంబరులో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసరా కమిటీ సభ్యుడు శ్రీనాథ్, వీసీసీ కో ఆర్డినేటర్ సతీష్, ఆర్గనైజర్లు కల్యాణి, భవానీ, మణి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న పద్మనాభరాజు

మద్దిపాలెం: చెన్నై రాష్ట్రం మధురైలో జరిగే సీపీఎం కార్మిక, కర్షక 24వ మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ సీనియర్ నాయకుడు పద్మనాభరాజు కోరారు. జీవీఎంసీ 50వ వార్డు పరిధి మధవధార శ్రీమాధవ యువజన సమాజం దగ్గర జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అట్టడుగు ప్రజానీకం కోసం అనునిత్యం పని చేస్తున్న పార్టీ సీపీఎం అని గుర్తు చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, నిరుద్యోగ సమస్యను తగ్గించాలని, పెరుగుతున్న ధరలను అదుపు చేయాలని ప్రభుత్వాలపై ఎప్పటికప్పుడు పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ, ప్రజల్ని చైతన్య పరుస్తూ పోరాటం నడిపేందుకు సీపీఎం పార్టీ 24వ మహాసభలను తమిళనాడు రాష్ట్రం, మధురైలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూన పార్వతి, అమ్ములమ్మ, జనార్దనమ్మ, సీతమ్మ, చిలకమ్మ, అనురాధ, భవాని, కె. సుధాకర్, ఎస్. రామగోపాలరావు, కూన వెంకటరావు, కూన సత్యనారాయణ, నాయుడు బాబు, జి.ఎస్. మూర్తి, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

దొండపర్తిలో కార్డన్ సెర్చ్

18 వాహనాలు సీజ్



దొండపర్తిలో తనిఖీ చేస్తున్న ఫోర్త్‌టౌన్ సీఐ సత్యనారాయణ

సీతమ్మధార: ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం దొండపర్తిలో ఈస్ట్ సబ్ డివిజన్ సిబ్బందితో కలిసి ఫోర్త్ టౌన్ సీఐ ఎ.సత్యనారాయణ కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా సరైన పత్రాలు లేని 18 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అలాగే ఇళ్లు, షాపులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ 8 బృందాలతో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. కిరాణాషాపులు, పాన్‌షాపులు, ఇళ్లు తనిఖీలు చేసినట్లు తెలిపారు. రికార్డులు లేని ద్విచక్ర వాహనాలు తనిఖీ చేసి 18 వాహనాలు సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు జి.వెంకటరావు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యూటీఎస్ యాప్‌పై అవగాహన



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న రైల్వే అధికారులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ జనరల్ టికెట్స్ మొబైల్ యాప్‌పై విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు, ఈ యాప్ వినియోగించే వారికి 3 శాతం క్యాష్‌బ్యాక్ రాయితీ అందజేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె. సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. 2016లో జనరల్ టికెట్ బుకింగ్ యాప్‌ను ప్రారంభించినట్లు, ఈ యాప్ ద్వారా ప్లాట్‌ఫాం టికెట్లు, జనరల్ టికెట్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ యాప్‌పై సాధారణ ప్రయాణికులకు విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్లాట్‌ఫాంలపై మీడియా ద్వారా, పోస్టర్లు, పాంప్లెట్ల ద్వారా కూడా ప్రయాణికులకు తెలియజేస్తున్నారు. ఆర్–వ్యాలట్ రీచార్జి చేసుకుని, యూటీఎస్ అనే యాప్ ద్వారా సాధారణ రైలు టికెట్లు బుక్ చేసుకున్న వారికి 3 శాతం రాయితీ అందజేస్తున్నారు. ఈ రాయితీ 2025 ఆగస్టు 24వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. అండ్రాయిడ్, ఐవోఎస్, విండోస్ ఆపరేటింగ్ సిస్టం వాడుతున్న ప్రతి మొబైల్‌లో ఈ యాప్ ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

యూటీఎస్ యాప్ ద్వారా ప్రయోజనాలు..

- సాధారణ టికెట్ల కోసం కౌంటర్ల వద్ద లైన్‌లో నిల్చోవాల్సిన అవసరం ఉండదు
- టికెట్ల కోసం చిల్లర ఇవ్వాలనే సమస్య ఉండదు
- ఎక్కడి నుండైనా టికెట్లు బుక్ చేసుకోవచ్చు
- అందరికీ వీలుగా వివిధ భాషల్లో సేవలు
- సులభతరమైన నగదు రహిత చెల్లింపులు

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబకు పూజలు చేస్తున్న ఈవో, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఆలయ ఈవో జి.వి. రామాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి స్వయంగా జలాభిషేకం నిర్వహించారు. అర్చకుడు భక్తుల గోత్రనామాలతో అమ్మవారికి విశేష పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని నూతన చీర, పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రవాస సాహిత్యం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ రఘురామారావు

సీతంపేట: ప్రవాస భారతీయుడు డాక్టర్ రమేష్ ప్రసాద్ రావెళ్ల (యూఎస్ఏ) రచించిన 'ప్రవాస సాహిత్యం' విమర్శనా వ్యాస సంపుటి పుస్తకావిష్కరణ సభ బుధవారం సాయంత్రం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. విశాఖ సంస్కృతి మాస పత్రిక సంపాదకుడు శిరేల సన్యాసిరావు అధ్యక్షతన జరిగిన సభలో విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఘండికోట రఘురామారావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 55 ఏళ్ల క్రితం విశాఖ నుంచి యూఎస్‌కు వెళ్లి ఉన్నత స్థానాలు అధిరోహించినా, తెలుగు భాష, సాహిత్యంపై రమేష్ ప్రసాద్ మక్కువ వదల్లేదని కొనియాడారు. అక్కడి ప్రపంచం, భాష, దృక్పథం వేరైనా అవేవీ తనపై ప్రభావం చూపలేదని, చక్కగా తెలుగు మాట్లాడుతూ వందలాది వ్యాసాలు రాయడమే కాక, ప్రవాస సాహిత్యం పేరుతో విమర్శనాత్మక పుస్తకం రాయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. శిరేల సన్యాసిరావు మాట్లాడుతూ ఒక పేజీ రాయాలంటే వంద పేజీలు చదవాలని, ఒక విమర్శ చెయ్యాలంటే వెయ్యి పేజీలు చదవాలని, ఈ పుస్తకం రాయడానికి రమేష్ ప్రసాద్ ఎన్ని పుస్తకాలు చదివారో ఇట్టే అర్థం అవుతుందన్నారు. అనంతరం గాంధీ సెంటర్ సంయుక్త కార్యదర్శి డాక్టర్ కె.వి.ఎస్. మూర్తి పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో హరిబాబు తమ్మినేని, మేడా మస్తాన్‌రెడ్డి, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

భర్త చెంతకు భార్య



భార్యను భర్తకు అప్పగించిన పోలీసులు

సీతమ్మధార: పిల్లలు పుట్టడంలేదనే మనస్తాపంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన ఓ వివాహితను ఫోర్త్ టౌన్ పోలీసులు 24 గంటల్లో తిరిగి భర్త వద్దకు చేర్చారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. రైల్వేన్యూకాలనీకి చెందిన ఆడారి జగదీశ్ స్టీల్ ప్లాంట్‌లో అసిస్టెంట్ లోకోపైలట్‌గా చేస్తున్నారు. జగదీశ్‌కు జయశ్రీతో 2020లో వివాహమైంది. వివాహం జరిగి ఐదేళ్లయినా పిల్లలు లేకపోవడంతో ఆమె బాధపడుతుండేది. ఆఫీస్‌కు వెళ్లిన తర్వాత భర్తతో తరచూ ఫోన్‌లో మాట్లాడుతూ ఉండేది. మంగళవారం ఆమె నుంచి ఫోన్ రాకపోవడంతో కంగారుపడి ఇంటి వద్ద ఉన్న వ్యక్తులకు ఫోన్ చేసి అడగ్గా, ఆమె లేదని సమాచారమిచ్చారు. దీంతో కంగారుపడిన జగదీశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసిన పోలీసులు టెక్నాలజీ సహాయంతో జయశ్రీ యలమంచిలిలో ఉన్నట్లు గుర్తించారు. ఆమెను భర్తకు అప్పగించారు.

విద్యుత్ రంగం ప్రైవేటీకరణ తగదు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

డాబాగార్డెన్స్: విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించొద్దని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న విశాఖలో ఏపీఈపీడీసీఎల్ పరిధిలో గల ఐదు జిల్లాల కార్మికులతో సదస్సు నిర్వహించనున్నారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించనున్న సదస్సుకు సంబంధించి బుధవారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటు కార్యాలయంలో సదస్సు పోస్టర్‌ను ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ విద్యుత్ రంగంలో ప్రైవేట్, కాంట్రాక్ట్, పీస్‌రేట్ కార్మికులకు ఇచ్చిన హామీలు ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. పీఆర్‌సీలో జరిగిన అన్యాయాన్ని ప్రస్తావించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు తీసుకొచ్చి కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారని, వారికి ప్రత్యామ్నాయం చూపించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులందర్నీ విద్యుత్ సంస్థలో విలీనం చేయాలన్నారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ప్రేమ్ చంద్రశేఖర్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పరశురామ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఉక్కు ఉద్యోగి మృతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్–1 విభాగంలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న విభాగ సీనియర్ ఫోర్‌మెన్ ఎం. శ్రీనివాసరావు (55) మృతి చెందారు. అయితే కుటుంబ సభ్యులు మరికొందరికి పునర్జన్మ ఇవ్వడానికి ముందుకు వచ్చారు. శ్రీనివాసరావు అవయవాలను దానం చేయడానికి అంగీకారం తెలిపారు.దీంతో ఆస్పత్రి వైద్యులు అందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. నగరంలోని సీతమ్మధారలో నివసిస్తున్న శ్రీనివాసరావు మార్చి 30న నైట్ షిఫ్ట్‌లో విధులకు హాజరయ్యారు. విధులు ముగించుకుని 31న ఉదయం 6.30 సమయంలో అవుట్ పంచ్ కొట్టి వెనుతిరగగా అక్కడ ఉన్న చెక్క తగులుకుని కింద పడ్డారు. ఈ సంఘటనలో అతను తీవ్రంగా గాయపడడంతో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. స్టీల్ ప్లాంట్ హెచ్‌సీ రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్విమ్మింగ్ శిక్షణ ప్రారంభం

ఉక్కునగరం: ఉక్కు కనిష్ఠ అధికారుల మానసిక ఉల్లాస కేంద్రం (స్టీల్‌క్లబ్)లో బుధవారం స్విమ్మింగ్ శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఏటా వేసవిలో ఉక్కునగరం, పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజల సౌకర్యార్థం స్టీల్‌క్లబ్‌లో స్విమ్మింగ్ కోచింగ్ ఇస్తుంటారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎం, క్లబ్ గౌరవ అధ్యక్షుడు ఎం. మధుసూదనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్విమ్మింగ్ నేర్చుకోవడం ప్రతీ ఒక్కరికీ అవసరమన్నారు. ఈత వల్ల శారీరక వ్యాయామంతో పాటు ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ మాట్లాడుతూ క్లబ్ సభ్యులు కాని వారు కూడా క్యాంప్‌ను వినియోగించుకోవచ్చన్నారు. ప్రతీ రోజు సాయంత్రం రెండు బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి వై. రవికుమార్, కోశాధికారి వేణుగోపాల్, జె. రమేష్, వెంకటరాజు, భువన కిరణ్, ఎ. రంగనాథం, బి.వి. రమణ, వి.ఎస్.బి. రాజు, ఎ. ఆది రమేష్, కె.ఎల్. నరసింహం, ఎం. కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే నవ సమాజ నిర్మాణం



కార్యక్రమంలో పాల్గొన్న సీపీ బాగ్చి, పోలీస్ అధికారులు, ఇంజినీరింగ్ కళాశాల ప్రతినిధులు, విద్యార్థులు

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

గోపాలపట్నం: నవతరానికి పునాదులు నేటితరం విద్యార్థులని, వీరి క్రమశిక్షణతోనే నవ సమాజాన్ని నిర్మించగలమని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. జీవీఎంసీ 88వ వార్డు నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో బుధవారం సైబర్ క్రైం, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తే ఉన్నత స్థితికి చేరతామన్నారు. సోషల్ మీడియాలో జరుగుతున్న మోసాలపై అవగాహనతో ఉండాలని సూచించారు. ధూమపానం, మద్యపానం, డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. వీటికి అలవాటు పడితే ఆర్థిక నేరాలకు పాల్పడే స్థాయికి దిగజారుతారని హెచ్చరించారు. అనంతరం సీపీ బాగ్చిని కళాశాల చైర్మన్ జి.సత్యనారాయణ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీసీపీ–2 మేరీ ప్రశాంతి, వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ ఎ.బి.పృథ్వీతేజ, పెందుర్తి సీఐ కె.వి. సతీష్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రదీప్ వర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సూపరింటెండెంట్ భారతి, ఇతర వైద్యులు

అగనంపూడి: సుఖ ప్రసవాలు జరిగేందుకు గర్భిణులు సహకారం అందివ్వాలని, వైద్యుల సూచనలు పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి అన్నారు. ఏరియా ఆస్పత్రిలో బుధవారం ప్రత్యేక గర్భిణుల ఓపీ కౌంటర్ల వద్ద సిజేరియన్ వద్దు–సాధారణ ప్రసవాలు ముద్దు అంటూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ గర్భిణులు వైద్యుల సూచనలు, సలహాల పాటిస్తూ పౌష్టికాహారం తీసుకుంటూ వ్యాయామం, తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించా రు. అప్పుడే సాధారణ డెలివరీలకు అవకాశం ఉంటుందన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన

కూర్మన్నపాలెం: స్వచ్ఛ సర్వేక్షణ్‌పై బుధవారం 87వ వార్డు తిరుమలనగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. తడి పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని సూచించారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. కాలనీ అసోసియేషన్ నాయకులు పరమానందం, విశ్వేశ్వరరావు,సన్యాసిరావు, రామరాజు, రామరాజు, సచివాలయ కార్యదర్శి సంధ్య తదితరులు పాల్గొన్నారు.